ప్రజాశక్తి

సోమవారం 4 డిసెంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ప్రత్యేక అధికారుల నియామకం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కోస్తా తీర మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులను ఆయా మండలాలకు సమన్వయ అధికారులుగా బాధ్యతలు అప్పగించారు. డిఆర్ఓ పెద్ది రోజా అన్ని మండలాల్లో తుపాను పరిస్థితుల పర్యవేక్షణ, సమన్వయ బాధ్యతలు నిర్వర్తించాలని, నాగాయలంక, కోడూరు మండలాలకు సమన్వయ అధికారిగా డిఆర్‌డిఎ పీడీ పిఎస్‌ఆర్ ప్రసాద్, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలకు జడ్‌పి సీఈవో జ్యోతిబసు, అవనిగడ్డ, మోపిదేవి మండలాలకు పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్, మచిలీపట్నం మండలానికి డ్వామ పీడీ జివి సూర్యనారాయణ సమన్వయ బాధ్యతలు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. మచిలీపట్నం కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి తుపాన్ పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర సహాయం, వాతావరణ సమాచారం కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 08672-252572, 08672-252000లకు సంప్రదించాలని తెలిపారు. కలెక్టరేట్‌తో ఆర్‌డిఓ, తీరం వెంబడి తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఉయ్యూరు మండలం కడవకొల్లులో వరి పనలు కడుతున్న కూలీలు

వాహనాలు అందుబాటులో లేక కంకిపాడు రోడ్డుపై ఉన్న ధాన్యం

ముంచుకొస్తున్న మిచౌంగ్

- అప్రమత్తమైన అధికారులు
- కంట్రోల్ రూమ్‌లు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ప్రత్యేక అధికారుల నియామకం
- ధాన్యం తరలించేందుకు రైతుల అవస్థలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మిచౌంగ్ తుపాను ముంచుకొస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కృష్ణాజిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తుపాను నేపథ్యంలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కోడూరు మండలంలోని మండల పరిధిలోని పాలకాయతిప్ప వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈదురుగాలుల వేగం పెరగడంతో తొమ్మిది అడుగుల మేర అలలు ఎగిసిపడుతున్నాయి. సముద్రం ముందుకు చొచ్చుకు రావడంతో ప్రయాణికులను అనుమతిని నిలిపివేశారు. తీర గ్రామాల్లో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తుపాను నేపథ్యంలో ధాన్యం రైతులు అవస్థలు పడుతున్నారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం మిల్లులకు తరలించే అవకాశం జిల్లా అధికారులు కల్పించిని రవాణా వాహనాల కొరతతో ఆదివారం సాయంత్రానికి చాలా ప్రాంతాల్లో రోడ్లపైనే ధాన్యం ఉండిపోయింది.

... వార్తలు 5, 6 పేజీల్లో

పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లా కలెక్టర్ సూచనల మేరకు తుపాను కారణంగా సోమవారం కృష్ణాజిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తహెర సుల్తానా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎ-1 పరీక్షలు వాయిదా వేయడం జరిగిందని, పరీక్షల తేదీ తరువాత తెలియజేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలోనూ సోమ, మంగళవారాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ డిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు.

పంటలకు నష్టం జరగకుండా చూడాలి

ప్రజాశక్తి-విజయవాడ: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో పంటలకు నష్టం జరగకుండా రైతులు రెండు మూడు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోత కోసి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే లారీల్లో మిల్లులకు తరలించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. మిచౌంగ్ తుపాను హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్, జెసి డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరి పండించిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు జాగ్రత్త చర్యలు సత్వరమే చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షాలకు ధాన్యం తడిసి దెబ్బతిని రైతులు నష్టపోకూడదని స్పష్టం చేశారు. తడిసి దెబ్బతిని తేమ శాతం ఉన్నప్పటికీ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు.

ట్రై సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్ డిల్లీరావు, ఎమ్మెల్యే విష్ణు

వికలాంగుల సాధికారతకు కృషి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ

వికలాంగులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెంది సాధికారత సాధించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, వికలాంగుల శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్‌రెడ్డిలతో కలెక్టర్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం జగన్ నేతృత్వంలో వికలాంగుల సంక్షేమానికి విశేష కృషి జరుగుతోందని పేర్కొన్నారు. 1995 వికలాంగుల చట్టాన్ని సవరిస్తూ 2016లో వికలాంగుల హక్కుల కొత్త చట్టానికి రూపకల్పన చేసి ఈ ఏడాది కొత్తగా మార్గదర్శకాలు, నిబంధనలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ చట్టం మేరకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన వికలాంగుల సంక్షేమం, అర్జీల పరిష్కారానికి ఒక కొత్త కమిటీ ఏర్పాటైందని, ఈ కమిటీ ద్వారా వికలాంగుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వికలాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు (మిగతా 6లో)

గడువులోగా గృహ నిర్మాణాల పూర్తి

ఎన్‌టిఆర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ రజని

ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాలను నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రజని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ నగరంతో పాటు ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గృహ నిర్మాణాలు, వాటి స్థితిగతులపై 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రజని వివరించారు.

ప్రశ్న: జిల్లాలో హౌసింగ్ స్కీమ్ పరిస్థితిని వివరించగలరు?

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా హౌసింగ్ స్కీమ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ స్కీమ్‌ను విజయవంతం చేసేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ప్రభుత్వం ఎన్‌టిఆర్ జిల్లాకు ఎన్ని గృహాలను మంజూరు చేసింది?

ఇల్లు లేని ప్రతి పేదవాడికి గృహ నిర్మాణం చేపట్టాలనే ధ్యేయంతో 84,432 గృహాలను మంజూరు చేయడం జరిగింది.

ప్రశ్న: ఇప్పటి వరకు నిర్మాణాలు ఎన్ని పూర్తయ్యాయి?

ఇప్పటి వరకు 15,613 గృహాల నిర్మాణం పూర్తయ్యింది.

ప్రశ్న: నేటికీ ప్రారంభించని గృహాలు ఎన్ని ఉంటాయి?

వివిధ కారణాల రీత్యా 750 గృహాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

ప్రశ్న: వివిధ దశల్లో ఎన్ని గృహాలు ఉన్నాయి?

విజయవాడ సిటీతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆయా లేఅవుట్స్‌లో 68,069 గృహాల నిర్మాణ పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి.

ప్రశ్న: గృహ నిర్మాణాలకు వెచ్చిస్తున్న ఖర్చు ఎంత?

రూ.529.49 కోట్లు ఖర్చు అవుతుంది.

ప్రశ్న: ఒక్కో యూనిట్ (గృహం) ఖర్చు ఎంత?

ప్రభుత్వం నిర్ణయించిన దాని ప్రకారం రూ.1.80 లక్షలు.

ప్రశ్న: వీటిల్లో కేంద్రం వాటా ఎంత? రాష్ట్ర వాటా ఎంత?

ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా (పిఎంఎవై) కింద రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.30 వేలు కేటాయించడం జరుగుతుంది.

ప్రశ్న: లబ్దిదారుడి ఎంత చెల్లించాల్సి వుంటుంది?

లబ్దిదారుడు రూ.35 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా ఎన్ని లేఅవుట్లలో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి?

జిల్లాలోని 337 లేఅవుట్లలో గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్రశ్న: విజయవాడ అర్బన్‌కు సంబంధించి ఎన్ని గృహాలు మంజూరయ్యాయి?

మూడు నియోజకవర్గాలకు కలుపుకొని 37,218 గృహాలు మంజూరు అయ్యాయి. వీటిలో 3,713 గృహాలు పూర్తయ్యాయి. 277 గృహాల పనులు నేటికీ (మిగతా 6లో)

తెలంగాణలో కాంగ్రెస్ విజయం పట్ల హర్షం

కాంగ్రెస్ నాయకులు పోతిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధించడంపై సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోతిన వెంకటేశ్వర రావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. **కంచికచర్ల :** తెలంగాణలో కాంగ్రెస్ ఆధిక్యం సాధించటంతో కంచికచర్లలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. **గంపలగూడెం :** 2023 సార్వత్రిక ఎన్నికల్లో టిఆర్ఎస్‌ను హతమార్చి కాంగ్రెస్ సాధించిన విజయమై తోటమూలలో సంబరాలు జరిగాయి. మండల టిడిపి ఆధ్వర్యంలో భారీగా బాణా సంచా కాల్చి హర్షధ్వానాలు చేశారు. **ఇబ్రహీంపట్నం :** తెలంగాణలో కాంగ్రెసు పార్టీ విజయంతో స్థానిక కాంగ్రెసు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సంబరాల్లో పాల్గొన్న స్థానిక నాయకులు, ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్, మాట్లాడుతూ 4 రాష్ట్రాల ఫలితాల్లో 3 రాష్ట్రాల్లో కొద్ది తేడాతో ఓటమి పాలైనందుకు కొంత బాధ కలిగించినా తెలంగాణలో విజయం సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. **మైలవరం :** తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడం పట్ల ఆదివారం మైలవరంలోని బోస్ బొమ్మ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. **వన్‌టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు, ఆంధ్రప్రదేశ్ సెటిలర్స్‌కు పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ ఆదివారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. **నందిగామ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో నందిగామ గాంధీ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చారు. కేక్ కటింగ్, స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణలో ఫలితాలపై ఆనంద వ్యక్తం చేశారు. **తిరువూరు :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో విజయం సాధించిన సంద ర్భంగా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు తిరువూరులోని రాజీవ్ భవన్ ఎదుట సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి టపాసులు పేల్చి విజయోత్సవాన్ని జరిపారు.

మైలవరంలో బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు

విగ్రహాలను ఆవిష్కరించిన ఎంపి కేశినేని నాని

విగ్రహావిష్కరణలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలంలోని వామకుంట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలను విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులుగా, సమాజంలో సమానత్వం కోసం కృషి చేసిన మహనీయులను నేటికీ గుర్తు చేసుకుంటూ వారి ఆశయాలను కొనసాగించడమే వారికి మనమిచ్చే నివాళులన్నారు. ఈ కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర నాయకురాలు గౌతు శిరీష, టిడిపి నియోజకవర్గ నాయకులు శావలదేవదత్, నలగట్ల స్వామిదాస్, పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కార్తీక మాసం సందర్భంగా శ్రీ దుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ వీర వెంకట రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు జరిగాయి. గాయత్రీ అర్చక యాగ్నిక పురోహిత సేవాసంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ చేతులు మీదుగా పుణ్య దంపతులతో ఈ సామూహిక వ్రతాలు చేయించారు. సాయి రామ్ థియేటర్ సెంటర్‌లోని టీ స్టాల్ అధినేత తమ్మిన సతీష్ దంపతుల వితరణతో యాత్రికులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు శర్మ మాట్లాడారు.

విస్సన్నపేట ఎ.కొండూరులను కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - విస్సన్నపేట : తిరువూరు నియోజకవర్గంలో విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ జిల్లా అధ్యక్షులు వి.నాగరాజు జిల్లా ఉపాధ్యక్షులు పాన ఆనందరావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి విస్సన్నపేట ఎ.కొండూరు గంపలగూడెం పర్యటించారు. సందర్భంగా వారు వ్యవసాయ కూలీలతో నష్టపోయిన కౌలు రైతులు, రైతులతో మాట్లాడారు. అనంతరం గంపలగూడెం మండలం అనుమోలు వెంకట నరసయ్య భవనంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంపలగూడెం, తిరువూరు కరువు మండలాలుగా ప్రకటించి ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. వర్షపాతం లేకపోవడమే కాకుండా వేసిన పంటకు గిట్టుబాటు ధర దిగుబడి లేకపోవడం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు డ్వాక్రా రుణాలను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. వ్యవసాయ కూలీలకు 200 రోజులు ఉపాధి హామీ పని చూపించాలని రూ.600 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నందిగామ : సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం లింగాల పాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్‌ను సత్య సాయి సేవా సమితి సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లి నేని పద్మజ, స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనతో హోరెత్తిన మునేటి తీరం

ప్రజాశక్తి - కంచికచర్ల : కార్తీక మాసం ఆదివారం కావడంతో మండలంలోని మునేటి తీరం హోరెత్తింది. మునేటి ఒడ్డున మామిడి తోటల్లో కార్తీక వనసమారాధన సందర్భంగా వనభోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది. కంచికచర్ల, నందిగామ, వీరులపాడు మండలాలతో పాటు విజయవాడ నుండి సైతం జనం ద్విచక్ర వాహనాలు, కార్లలో వచ్చి ఉదయం నుండి సాయంత్రం వరకు వనసమారాధనలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో గుంపులుగా ఒకచోట చేరి ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. కంచికచర్ల కు చెందిన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కీసర మునేటి ఒడ్డున వనసమారాధన నిర్వహించారు. అనంతరం వివిధ రకాల వంటకాలు వండి మధ్యాహ్నం వనభోజనాలు నిర్వహించారు. మునేటిలో యువకులు స్నానం చేస్తూ కేరింతలు కొట్టారు. సాయంత్రం వేళ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో గల వ్యవసాయ కూలీలు సైతం గుంపులుగా వచ్చి వనభోజనాలు ఏర్పాటు చేసుకుని సరదాగా గడిపారు. గొట్టుముక్కల సమీపంలో అటవీ ప్రాంతంలో మద్దులమ్మ దేవాలయం వద్ద చుట్టుపక్కల గ్రామాలతో పాటు విజయవాడ నుండి సైతం ప్రత్యేక వాహనాల్లో వచ్చి దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం పాలపొంగళ్ళు నిర్వహించారు. దీంతో అటవీ ప్రాంతం యాత్రికులతో కిటకిటలాడుతూ సందడి వాతావరణం నెలకొంది.

గొట్టుముక్కల మద్దులమ్మ దేవాలయం వద్ద సందడి

బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

ప్రజాశక్తి - మైలవరం : ఎపిఎస్ఆర్‌టిసి వారు ఇబ్రహీంపట్నం నుండి కంచికచర్ల, జమలాపురం, వయా మైలవరం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు తిరుగుతున్న రింగ్ బస్ సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రం మధిర నియోజకవర్గ పరిధిలోని జమలాపురంలో ప్రఖ్యాతిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆలయానికి ఏపీలోని పలు జిల్లాల నుండి యాత్రికులు వస్తుంటారు. ఉద్యోగస్తులు, విద్యార్థులు, రైతులు, పలు రకాల వ్యాపారస్తులు నిత్యం ఇబ్రహీంపట్నం - కంచికచర్ల, జమలాపురం, మైలవరం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో రోజుకు రెండు రింగు బస్సులను నడిపేవారు. ఆంధ్రా వాళ్ళు తెలంగాణకి, తెలంగాణ వారు ఆంధ్రాకి వెళ్లాలంటే రింగు బస్సులు ఉండటం వలన ఇబ్బంది ఉండేది కాదు. ఇటీవల ఈ రింగ్ బస్ సర్వీసులను నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఆర్టీసీ యాజమాన్యానికి కూడా పలువురు ఉద్యోగస్తులు బస్ సర్వీసును పునరుద్ధరించాలని అర్జీ రూపంలో విన్నవించారు. 3 నెలలు గడిచిన బస్ సర్వీసును పునరుద్ధరించలేదు. అధికారులు స్పందించి రింగ్ బస్ సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

మధుమేహంపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రోజురోజుకూ మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఆందోళకర స్థాయిలో పెరుగుతోందని, షుగర్ వ్యాధి పట్ల మరింత అప్రమత్తత అవసరమని యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్, ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ డాక్టర్ యలమంచి సదాశివరావు అన్నారు. మధుమేహం, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించి సమగ్ర విశ్లేషణ లక్ష్యంతో, ఐఎంఎ, వైడిఆర్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో డయాబ్ ఎండో కాన్ 2023 సదస్సును నిర్వహించారు. నగరంలోని నోవాటెల్ హోటల్లో ఆదివారం జరిగిన ఈ సదస్సులో 25 మంది జాతీయ స్థాయి వైద్య నిపుణులు, 500 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ సదాశివరావు మాట్లాడుతూ తాజా అంచనాల ప్రకారం, మన దేశంలో ప్రస్తుతం 10 కోట్ల మంది షుగర్ పేషెంట్లున్నారన్నారు. ఈ విషయంలో యువతను అప్రమత్తం చేసి, ప్రీ-డయాబెటిస్ స్థితిలో ఉన్నవారిని డయాబెటిస్ రోగులుగా మారకుండా నిరోధించాల్సివుందన్నారు. గర్భిణీలకు చికిత్సల గురించి గైనకాలజిస్టుల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.రావుకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. ఈ సదస్సులో ఐఎంఏ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ చలసాని ప్రమోద్, సెక్రటరీ డాక్టర్ అక్కినేని శివరామ్, వైడిఆర్ఎఫ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి హిమన, సెక్రటరీ డాక్టర్ వై. ఐశ్వర్య, జాయింట్ సెక్రటరీ డాక్టర్ వై. అమూల్య పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హైదరాబాద్‌లో పెన్షన్ అందజేసిన వాలంటీర్

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ తూర్పు నియోజకవర్గం రామలింగేశ్వర నగర్ 70వ సచివాలయానికి చెందిన వార్డు వాలంటీర్ వేమురెడ్డి సునీత దాతృత్వం చాటుకుంది. తాను మన రాష్ట్రం దాటి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లి మరి సేవలందించింది. తూర్పు నియోజకవర్గంలోని 15వ డివిజన్ కు చెందిన చోడిశెట్టి లక్ష్మీ పద్మావతి ట్రైన్ లో నుంచి జారీ పడి పోవడంతో కాలికి తీవ్ర గాయం అయ్యి హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందు తుంది. దీంతో ఆమె చికిత్స పొందు తున్న చోటికే వెళ్లి పెన్షన్ అందజేశారు. పెన్షన్ ఇచ్చేందుకు తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ దాతృత్వం చాటిన వాలంటీర్ వేమూరెడ్డి సునీతను అభినందించారు.

పింఛను ఇస్తున్న వాలంటీర్

పోలింగ్ కేంద్రాల వద్ద ముగిసిన క్యాంపెయిన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరంలో ఈనెల 2, 3 తేదీలు శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పశ్చిమంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలక్షన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు పశ్చిమ నియోజక వర్గంలోని అన్ని వార్డుల్లో గల పోలింగ్ కేంద్రాల్లో ఎలక్షన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఎలక్షన్ క్యాంపెయిన్ డేలో భాగంగా విజయవాడ పశ్చిమ తహశీల్దారు, (ఏఈఆర్ఓ) పి.జాహ్నవి తన పరిధిలో గల 50 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బిఎల్ఒలకు తగు సూచనలు చేశారు. జనవరి 6లో కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన యువతకు ఓటు ఆవశ్యకత వివరించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ పోలింగ్ కేంద్రాలైన స్కూల్స్, కాలేజీల్లో ఓటర్ నమోదు, ఓటరు గుర్తింపు ప్రత్యేక శిబిరాల ఓటు నమోదు, తప్పులు సరిదిద్దుకోవటం, డివిజన్ల మార్పు వంటివి క్యాంపెయిన్‌లో సరిచేసుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని కెబిఎన్ కళాశాల, భవానీపురం పరిధిలో దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్, లేబర్ కాలనీలోని ఉప్పలపాటి రామచంద్రరాజు మున్సిపల్ హైస్కూల్ తదితర ప్రాంతాలలో ఎలక్షన్ క్యాంపెయిన్ జరిగింది. లేబర్ కాలనీలోని ఉప్పలపాటి రామచంద్రరాజు మున్సిపల్ స్కూల్‌లో డిఈఆర్ఓ వెంకటలక్ష్మి పర్యవేక్షణలో 118, 119, 130, 156, 157, 159 సచివాలయాల పరిధిలో బిఎల్ఓ సమక్షంలో ఓటర్ పరిశీలనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సచివాలయ పరిధిలో ఉన్న సెక్రటరీలు, వాలంటీరు పాల్గొన్నారు.

ఎలక్షన్ క్యాంపైన్‌లను సందర్శించిన తహశీల్దార్ జాహ్నవి

ఫెన్సింగ్ బాలబాలికల జట్లు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం మండలం మల్లికార్జున పాఠశాలలో ఆదివారం సాయంత్రం కృష్ణా జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాల బాలికల ఫెన్సింగ్ జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలు కృష్ణాజిల్లా ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి నాగం సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణాజిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు కృష్ణాజిల్లా ఫెన్సింగ్ సంఘం ఇంచార్జ్ ధనియాల నాగరాజు తెలిపారు . స్పోర్ట్స్ స్టేడియంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొంటారని, విజయనగరం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో డిసెంబర్ 8 9 10 తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో కృష్ణా జిల్లా జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కోకో సంఘ కార్యదర్శి సత్యప్రసాద్, కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ సంఘ కార్యదర్శి విజయకుమార్ గోగులమూడి, శ్రీలత, చైతన్య, వ్యాయమ ఉపాధ్యాయులు రాంబాబు, బాలకృష్ణ, గౌస్య బేగం, తాన్య, హరి లు పాల్గొన్నారు. అండర్ 17 బాలుర ఇప్పి విభాగంలోప రెహాన్ , టీ కార్తికేయ ఏ కార్తికేయ, రాజమౌళి, ఫాయిల్ విభాగంలో డి రామ చంద్ శ్రీ ఈశ్వర్, ఓ వెంకటేశ్వర రాజ్, పి రోహిత్, భరత్ చంద, టి జస్విల్ రోహాన్, సేబర్ విభాగంలో సిహెచ్ జయవంత ఆదిత్య, ఎం లీలా గౌతమ్, పి పవన్, జి పార్థసారథి, ఎన్ టి రామ్, ఇప్పి బాలికల విభాగంలో ఎస్.కె జనబీ, కెవిఎస్ మహిత, ఎం సుప్రియ, జి పూజిత, ఫైల్ విభాగంలో పి విష్ణు ప్రియ, వీ రోషిని ప్రజ్ఞ, బి పుష్ప, జి లోచన, సేబర్ విభాగంలో డిఎస్ ప్రియూష, వై మాధురి, పి జస్మిత, జె పావని, అండర్ 14 బాలుర విభాగంలో పి మణికంఠ, ఎస్.కెషాశిద్, బి కృష్ణ శేష సాయి, ఏ మల్లికార్జున రావు, కమల్ బేగ్, ఫైయిల్ విభాగంలో ఎం సాయి ప్రశాంత్, పి వరుణ్ కార్తీక్, టీ తేజ్ దీప్, పి అభి, ఎండి తౌసిఫ్, అండర్ 14 బాలికల ఇప్పి విభాగంలో ఎం సూర్యప్రభ, ఎం దియా, పి అక్షయ శ్రీ, వి జెన్నీ ఫైల్ విభాగంలో ఈ జయ శ్రీ అనూష, జి లక్ష్మి ప్రసన్న, వై మోక్షజ్ఞ, కె వి ఎస్ జె వేద , సేబర్ విభాగంలో ఎస్.కె పర్వీన్ , డి మాన్య, ఎం సాయి చెన్నై, జి కీర్తి ఉన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీకాంత్

రోడ్డు భద్రత అందరి బాధ్యత : డిఎస్‌పి

ప్రజాశక్తి - గుడివాడ : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్‌ను విడనాడి ప్రమాదాలను అరికట్టాలని గుడివాడ డివిజనల్ పోలీస్ అధికారి పి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీవో హెూంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీకాంత్ మాట్లాడుతూ డ్రైవర్లకు డ్రెస్ కోడ్ తప్పనిసరని, ఆటో డ్రైవర్లు టర్నింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా సిగ్నల్ సూచికను చూపాలన్నారు. మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. వాహన చోదకులు వాహనాలు నడుపు సమయంలో నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మితిమీరిన వేగం, సిగ్నల్స్ క్రాస్ చేయడం, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. ప్రతి ఒక్కరు వాహన చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు చెందిన వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి రూ.5000 చొప్పున ప్రోత్సాహాలను డిఎస్పి అందజేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్, టూ టౌన్ సిఐలు ఇంద్ర శ్రీనివాస్, తులసీదర్, ఆటో డ్రైవర్స్, ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు అంగడాల సతీష్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎండిఒ

ప్రజాశక్తి-కోదూరు : ముంచుకొస్తున్న మిచాంగు తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఎలాంటి ఆందోళన గురి కావద్దని తుఫాను తీవ్రతరమైతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందని కోడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోడూరు మండల పరిధిలోని సముద్ర తీర ప్రాంత గ్రామాలైన హంసలదీవి, పాలకాయతిప్ప, ఉటగుండం, బసవానిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఇంటిలోకి కావలసిన వంట సామాగ్రి అవసరమైనవన్నీ తెచ్చి ఉంచుకోవాలని రానున్న 48 గంటలు వాతావరణం తీవ్రంగా ఉంటుందని తుఫాను ఎప్పటికప్పుడు దాని ప్రభావం ఏ దిశగా మారుతుందో తెలియదు కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే కంట్రోల్ రూమ్ కానీ, మీ దగ్గరలో ఉన్న వాలంటీర్ లేదా ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా ఉన్నతా అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేడు 'స్పందన' కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ లో సోమవారం స్పందన కార్యక్రమం తుఫాను కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ పరిస్థితులు పర్యవేక్షించేందుకు జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున సోమ వారం జరగవలసిన స్పందన కార్యక్రమ మచిలీపట్నం కలెక్టరేట్‌పాటు, డివిజన్ మండల కేంద్రాల్లో కూడా రద్దు చేశామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఈనెల 13, 14 ఢిల్లీలో జరిగే మాదిగల కురుక్షేత్ర మహాసంగ్రామం ధర్నాకు సిద్ధం కావాలని గోడ పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ మాదిగలందరూ తమ హక్కులు సాధించేందుకు సంఘటితంగా పోరాటం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు జుజ్జువరపు ప్రశాంతి, రాయల ప్రభాకర్ రావు, పేరయ్య పాల్గొన్నారు.

రైల్వేను ప్రైవేటీకరించొద్దని నిరసన

నిరసన చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: కేంద్రప్రభుత్వం రైల్వే గూడ్స్ షెడ్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని సిఐటియు మండల అధ్యక్షులు బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే ప్రైవేటు కరణ వ్యతిరేకంగా సిఐటియు అనుబంధ సంఘాల పిలుపుమేరకు ఆదివారం బాపులపాడు నూజివీడు రైల్వే స్టేషన్ ఆవరణలో నిరసన నిర్వహించారు. నూజివీడు గూడ్స్ నూట వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్టేషన్ మాస్టర్,గుడ్ సూపరెంట్ కి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లాభాల్లో నడిచే రైల్వేను అక్రమంగా అమ్మేస్తున్నారన్నారు. కార్మికుల జీతాలు పెంచమంటే కార్పొరేట్ సెక్టార్‌కు 1.25 వేల కోట్ల బడ్జెట్‌ను అక్రమంగా అందించి దన్నారు. రైల్వే రంగం మొత్తాన్ని ప్రైవేట్‌పరం చేసి కార్పొరేట్‌కు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని అన్నారు.రైల్వేను ప్రైవేటీకరించడం వల్ల ప్రజలపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే గుడ్ సెట్ ముఠా కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ గుర్తింపు కార్డులు వ్యాగన్ ట్రైలో కరెంటు దీపాలు మంచినీళ్లు సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో నూజివీడు రైల్వే స్టేషన్ ముఠావర్కర్స్ యూనియన్, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు గొల్లపల్లి ముఖేష్, ఎస్.కే భాష, పల్వాటి కృష్ణ,తమ్ముడ్రు మద్దిరామయ్య, ఎర్రబాల రాంబాబు, దొండపాటి మురళి, 40 మంది కార్మికులు పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో మంచినీరు కలుషితం

ప్రజాశక్తి పెదపారుపూడి : తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని వెంట్ర ప్రగడ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని వెంట్ర ప్రగడ గ్రామంలోని సాయిబాబా గుడికి సమీపంలో మెయిన్ వాటర్ లైన్ పైపు పగిలిపోవడంతో మురికి నీరు పైప్ లైన్ లోకి వెళ్లి మంచినీరు కలుషితం అవుతుందని, దానివల్ల గ్రామస్తులు రోగాల బారిన పడిన పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపు పగిలిపోయిందని పంచాయతీ సిబ్బందికి చెప్పినా తమ గోడు వినడం లేదన్నారు. అదేమిటంటే పంచాయతీలో నిధులు లేవని అందువల్ల మరమ్మతులు చేయలేని పరిస్థితి వచ్చిం దని సిబ్బంది చెప్పటం హాస్యాస్పదంగా ఉందని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

265 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : బిఆర్ ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జ్యోతి బా పూలే విజ్ఞాన కేంద్రం లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించిన ఈ మెడికల్ క్యాంపులో 265 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు శివన్నారాయణ మాట్లాడుతూ ఎంతోమందికి ఉపయోగపడే ఈ వైద్య సేవలను ఇంకా ఎక్కువ మంది సద్వినియోగ పరచుకోవాలని తద్వారా ఎక్కువమంది పేదలకు వైద్య సేవలు అందుతాయన్నారు. మెడికల్ క్యాంపు కన్వీనర్ పామర్తి నాగయ్య మాట్లాడుతూ రెండు నెలలకు సరిపడా మందులు రు.200 కే అందిచారని, ఈ వైద్య శిబిరంలో ప్రముఖ డాక్టర్లు డా॥ఎం పి.సురేష్ చంద్రారెడ్డి, డా? కుప్పా రామశాస్త్రి వైద్య సేవలు అందిచారని వారికి మరియు వాలంటీర్లకు ఆయన కతజ్ఞతలు తెలియజేశారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కోదూరు : రాష్ట్ర బీసీ సేన అధ్యక్షులు శౌంరి నాగరాజు జన్మదిన వేడుకలను కోడూరు మండల బీసీ సేన ఆధ్వర్యంలో స్థానిక ఐదవ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును బీసీ సేన సీనియర్ నాయకులు అద్దంకి పాండురంగారావు, కోడూరు మండల బీసీ సేన అధ్యక్షులు కొండవీటి సురేష్ లు కట్ చేసి నాగరాజుకు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సేన నాయకులు వేముల వెంకటేశ్వరరావు, తిరుపతి వీరాంజనేయులు, రామాను రామ్మోహన్‌రావు, ఉప్పు చిన్న వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి : ఎంపిపి

బహుమతులు అందజేస్తున్న ఎంపిపి అనగాని రవి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గన్నవరం ఎంపిపి అనగాని రవి మాట్లాడుతూ వైకల్యం ఉందని ఎటువంటి పరిస్థితులలో బాధ పడవద్దని, ఆత్మస్థైర్యం తో ముందుకి వెళితే విజేత నిలవచ్చని చాలా మంది నిరూపించారని ఆయన అన్నారు. గన్నవరం ప్రాంతంలో స్పందన మానసిక వికాస కేంద్రం లో దివ్యాంగులకు సమాజం స్పందించే సేవలకు ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. స్పందనలో దివ్యాంగులకు అత్యుత్తమమైన సేవలను అందిస్తున్న సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ను,సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ కు గన్నవరం యం.పి.పి.అనగాని, అతిధులు ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ప్రవేటు రంగంలో సేవలు అందిస్తున్న సంకాబత్తుల హరినాధ్ (ప్రభుత్వ రంగం విజయనగరం జిల్లా) బూధాటి శ్రీనివాస్ రావు(ప్రభుత్వం రంగం : కృష్ణా జిల్లా) కొమ్మిలి గీతాంజలి (ప్రవేటు రంగం, ఏలూరు జిల్లా) వి.ఎన్.ఎస్.ఆర్ ప్రసాద్ : (ప్రభుత్వం రంగం కృష్ణా జిల్లా) యస్.కె బాజి బాషా (ప్రవేటు రంగం కృష్ణా జిల్లా) అన్నం లక్ష్మీ (ప్రవేటు రంగం కృష్ణా జిల్లా) స్పందన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సేవారత్న పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఆర్థిక నిపుణులు గన్నే వెంకటరావు, ఉంగుటూరు మండలం వైస్ యం.పి.పి ఆర్వేపల్లి సింహాచలం,వీనస్ బుక్ సెంటర్ అధినేత మోటమర్రి శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కార్తీక వనసమారాధనలతో సమైక్యత

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు

ప్రజాశక్తి - భవానీపురం, విజయవాడ : కార్తీక వన సమారాధనలు సమైక్యతకు, స్నేహాభిమానాలు పెంచుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తూరు తాడేపల్లిలోని రాజుగారి మామిడితోటలో బ్రాహ్మణ కార్తీక వనసమారాధన ఆదివారం సందడిగా జరిగింది. బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతీయ సంప్రదాయంలో వన విహారానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ శర్వాణి మూర్తి, కొప్పరపు బలరామకృష్ణ మూర్తి పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల సమీపంలో 65వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున బైక్‌ను ఇసుక లారీ ఢీకొన్న ఘటనలో ఇంజనీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. పోలీసుల కథనం మేరకు కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం పెద ఓగిరాలకు చెంది కలిదిండి శేషాద్రి. (22 కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల అమృత సాయి ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిరోజూ ఉయ్యూరు నుండి కళాశాలకు బస్సులో వస్తున్నాడు. ఈ నెల 2న శనివారం కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు పూర్తయ్యాక సాయంత్రం ఇంటికి వెళ్లలేదు. శనివారం రాత్రి మరో స్నేహితుడితో కలిసి పరిటాలలో ఉన్నట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున స్నేహితుడితో కలిసి బైక్‌పై విజయవాడ వైపు వెళ్తుండగా పరిటాల సమీపంలో ఆంజనేయ దేవాలయం వద్దకు రాగానే విజయవాడ వైపు వెళ్తున్న ఇసుక లారీ బైక్‌ను వెనకనుండి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన శేషాద్రి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ మార్చురీకి తరలించారు. గాయపడిన మరో విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తుఫాను సమయంలో విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - విజయవాడ : మిచౌంగ్ తుపాను సమయంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రజలు, రైతులు విద్యుత్ ప్రమాదాలకు లోను కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజయవాడ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఇ) ఎ మురళీమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... మిచౌంగ్ తుపాను కారణంగా వర్షాలు, తీవ్రమైన గాలులు వల్ల వ్యవసాయ విద్యుత్ మోటార్లు మునిగి ఉంటాయని, స్టార్టర్స్, డబ్బాలు తడిసి ఉంటాయని, వాటిని ముట్టుకునే ప్రయత్నం చేయకూడదని అన్నారు. సర్వీసెస్ వైర్స్ డామేజ్ అవుతాయని, స్తంభాలు, వైర్స్ తెగిపోవచ్చునని, ఇటువంటి పరిస్థితుల్లో వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఆక్వారైతులు, ఏరియేటర్స్‌ను ముట్టుకోవద్దన్నారు. ఇళ్లకు సంబంధించిన సర్వీసు వైర్లు, వాటితో వేలాడే ఇనుప తీగలు, విద్యుత్ స్తంభాలను, ఇనుప స్తంభాలను అంటుకోకూడదని అన్నారు. వర్షాలు కురిసే సమయములో ఇంట్లో నుంచి బయటకు వెళ్లే సమయములో, వాహనాల్లో వెళ్లే సమయములో, అలాగే తడి చేతులతో ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ సమస్య, తీగలు తెగినా, పోల్స్ పడిపోయినా అందుబాటులో ఉన్న లైన్ ఇన్‌స్పెక్టర్‌కు, లైన్‌మ్యాన్‌కు, సబ్‌స్టేషన్ ఎఇ దృష్టికి, 1912 నెంబర్‌కు, కంట్రోల్ రూమ్‌కు సమాచారాన్ని తెలపాలని ఎస్ఇ కోరారు. తుపాను దృష్ట్యా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆయా ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మచిలీపట్నం డివిజన్,ఇఇ/ టెక్నికల్: 94408 17572, ఉయ్యూరు డివిజన్ జెఇ/ టెక్నికల్: 94910 54708, గుడివాడ డివిజన్ ఎఇ /టెక్నికల్: 94408 17573, విజయవాడ సర్కిల్ ఆఫీసు , ఎల్ఎంసి : 94408 17561కు ఫోన్ చేయాలని ఎస్ఇ మురళీమోహన్ కోరారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి : ఎస్‌ఎఫ్ఐ

సదస్సులో మాట్లాడుతున్న అశోక్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని ఎస్‌జిఎస్ కళాశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ జిల్లా ఎస్ఎఫ్ఐ మహాసభలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.అశోక్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి జగనన్న అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన ఇవ్వాలని, జి.ఒ నెంబర్ 77 వెంటనే రద్దు చేసి పి.జి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. బిజెపి ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (నూతన విద్యా విధానం) పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే పద్ధతులు కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని తక్షణమే విద్యారంగానికి నష్టం చేసే వాటిని తొలగించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీలు వెంటనే అమలు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు జిల్లా నాయకులు కె గోపాల్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు జి గోపినాయక్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సి.హెచ్ వెంకటేశ్వరరావు, ఐద్వా మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.నాగమణి, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సందడిగా వనసమారాధన

ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధన సందడి సందడిగా జరిగింది. తిరువూరు శివారు పిటి.కొత్తూరు సమీపంలోని మామిడితోటలో ఆదివారం జరిగిన ప్రజాసంఘాల వన సమారాధన కుల మతాలకతీతంగా పిల్లలు, యువతీ, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఆహ్లాదకరమైన వాతావరణ మధ్య చిన్న పిల్లల డాన్స్, కుర్చీలాట, మహిళలకు, పురుషులకు మెోకలాగుట వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు సిఐటియు నాయకులు పంతంగి శ్రీనివాసరావు జనవిజ్ఞాన వేదిక నాయకులు మేకల నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ అనేకమంది తమ తమ కులాల వారీగా ఎన్నికలు పిక్నిక్లు జరుపుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సంఘాల పిక్నిక్‌లో కులమతాలకతీతంగా పాల్గొనడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐద్వా నాయకులు ఎస్ కుమారి పి తులసీరాణి ఎం లక్ష్మి, ఎం.నాగమణి, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, జెవివి నాయకులు ఎం.హరికృష్ణ, డివైఎఫ్ఐ నాయ కులు ఎస్.కె నాగుల్ మీరా, మోటూరు చింతయ్య, కూరపాటి వెంకటరత్నం తదితరులు విజయవంతంగా నిర్వహించారు.

'న్యూ జనరేషన్ యూనిటీ' వార్షికోత్సవ వేడుకలు

విద్యార్థికి పరీక్ష అట్ట,పెన్సిల్ అందజేస్తున్న న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ నిర్వాహకులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని వారి కార్యాలయంలో నాల్గవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులిగడ్డ సత్యనారాయణ, కళ్యాణ్ ఆచారి, జగన్మోహన్, గోవర్ధన్ మోడీ, అశోక్ పాల్గొని సంస్థకు అభినందనలు తెలిపారు. గోవర్ధన్ మోడీ తన కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసి విద్యార్థులకు పరీక్ష అట్టలు, బాక్సులు, పెన్సిల్లు అందించారు, బాలు తన కుటుంబ సభ్యులతో వద్దులకు, పేద విద్యార్థులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు భోజనాలు అందించారు. పలువురు సంస్థ కార్యక్రమాలను ప్రశంసిస్తూ ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ప్రముఖులు వీడియోల ద్వారా ప్రశంసలు అందించారు. సంస్థ కార్యదర్శి సాయి వినయ్ కుమార్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం కార్యాలయం నిర్మించే సమయంలో డబ్బులు లేని సమయంలో, స్నేహితుల సహాయంతో అద్దెలు కట్టుకొని ముందుకు వెళుతూ మూడు సంవత్సరాలు దిగ్విజయంగా నిర్వహిస్తూ ఎంతోమందికి విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తూ అర్హత పరీక్షలకు చిన్న గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలా తమకు ఎంతగానో సహకరిస్తున్న గ్రూప్ సభ్యులకు, మిత్రులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు, అతిథులకు, పత్రిక, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియపరిచారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన యాత్రికులు

దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను ఆశీర్వదిస్తున్న ఆలయ అధికారులు

పెనుగంచి ప్రోలు దేవాలయంలో

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను కార్తీకమాసం ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు పోటెత్తారు. దేవస్థానంలో ఆలయ అర్చకులు లోకకళ్యాణర్థమై సూర్యో పాసన సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా దేవస్థానంలో ఉదయం 9 గంటల నుండి మ 12 గంటల వరకు ఆలయ అర్చక సిబ్బంది సహస్రలింగార్చన సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా సాయంత్ర సమయంలో నటరాజ స్వామి ఆలయము, ఊంజల్ సేవ (దీపారాధన సేవ) నిర్వహించనున్నట్లు దేవాలయ అధికారులు తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం విచ్చేశారు. **పెనుగంచిప్రోలు :** కార్తీకమాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారు పరివార దేవతామూర్తులకు ఆదివారం పండ్ల అలంకరణలో దర్శనమిచ్చారు. దాతలు సౌజన్యంతో అందించిన వివిధ రకాల పండ్లను ఆలయ అర్చకులు అమ్మవారిని, స్వామివారిని, సహ దేవతామూర్తులను ప్రత్యేకంగా శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు సూచన మేరకు అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సిపిఎం సానుభూతిపరులు రాములమ్మ మృతికి సంతాపం

ప్రజాశక్తి - విజయవాడ : 59 డివిజన్ సింగ్ నగర్ లెనిన్ సెంటర్‌లో నివాసం ఉంటున్న సిపిఎం సానుభూతి పరులు నందం రాములమ్మ (98) మృతికి ఆ పార్టీ నాయకులు ఆదివారం సంతాపం తెలిపారు. గత నెల 23న హైదరాబాద్‌లో అనారోగ్యంతో ఆమె మృతిచెందగా, ఆదివారం సింగ్ నగర్ లెనిన్ సెంటర్లోని నివాసం వద్ద సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, పలువురు నాయకులు రాములమ్మ మృతికి సంతాపం తెలిపి, మాట్లాడారు. రాములమ్మ పార్టీ పట్ల అభిమానంతో, మహిళా సంఘం బాధ్యులుగా అనేక పోరాటాలలో పాల్గొన్నారని తెలిపారు. మహిళా సంఘం మానవి పత్రిక చందాదారులుగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యవర్గ సభ్యులు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు జి.ఝాన్సీరాణి, నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ పరిధిలో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డిల్లీరావు నందిగామ నియోజకవర్గ ఈ ఆర్వో అయిన ఆర్డీవో సాయి బాబు పట్టణ ఏఈ ఆర్ఓ మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం ఆదేశాల మేరకు 2,3 తేదీల్లో పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రచార దినోత్సవం ఆది వారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జయరాం ఆదివారం పట్టణంలోని అన్ని పో లింగ్ కేంద్రాలను కమిషనర్ తనిఖీ చేశారు.

ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణం సమీపంలోని తిరుమలగిరి రోడ్డులో గల మామిడి తోటలో డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్విమ్మింగ్ కుటుంబ సభ్యులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమం లో స్విమ్మింగ్ కోచ్ దంపతులు పొట్లాబత్తిన పాండురంగా రావు, లక్ష్మీ దంప తులను సన్మా నించారు. ఈ సందర్భంగా ఆటలు పోటీ లు నిర్వహించి బహుమతులందజేశారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నందిగామ : డిసెంబర్ 5న జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ముప్పాళ్ళ గ్రామంలోని ఎస్సీ కాలనీలో బస్సు యాత్రపై సన్నాహక సమావేశం నిర్వహించారు. శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మేలు చేసిన జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

శివాలయంలో కల్యాణ మహోత్సవం

నందిగామ : నందిగామ మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో ఆదివారం శివాలయం దేవాలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. సీనియర్ న్యాయవాదులు ప్రసాదు, బొండలపాటి రామకృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉరుకులు...పరుగులు

- తుపానుతో హడావిడిగా వరికుప్పలు
- ధాన్యం తడవకుండా జాగ్రత్తలు

కడవకొల్లులో హడావిడిగా కుప్పలు వేస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : తుఫాన్ హెచ్చరికంలు అన్నదాతల కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొస్తున్న తరుణంలో మిచౌంగ్ తుఫాన్ రైతు గుండెల్లో రైళ్ల పరిగెత్తిస్తుంది. రెండురోజులుగా ఆకాశం మబ్బులు కమ్మి చల్లని గాలులు వీస్తూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మండల పరిధిలో 12,320 ఎకరాల్లో వరి సాగుచేయగా అందులో 2,179 ఎకరాల్లో వరి కోతలు కోయగా, 870 ఎకరాల్లో పంట ప నలపై ఉంది. మరి కొంతమేర మిషన్తో కోతకోసి ధాన్యం రోడ్లపై ఆరబోసి వర్షానికి తడవకుండా పట్టాలు కప్పి ఉంచారు. ఈనేపథ్యంలో తుఫాన్ తీరం దాటే సమయం తరువాత రెండురోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రై తులను బెంబేలెత్తిస్తున్నాయి. ధాన్యం సంచులకు ఎత్తి మిల్లులకు తరలించేందుకు లారీలు,

ధాన్యానికి పట్టాలు కప్పిన దృశ్యం

ట్రాక్టర్లు ఏర్పాటుచేయకపోవడంతో బస్తాలపై పట్టాలు కప్పి తడవకుండా తం టాలు పడుతున్నారు. పెరిగి కూలీరేట్లు తుఫాను హెచ్చరికలు, వాతావరణ మార్పులతో కూలీరేట్లు అమాంతంగా పెరిగి పోయాయి. పంట కోసి పొలాల్లో పనలపైఉన్న స్థితిలో వర్షానికి తడిసి పంటనష్టం క లుగుతుందన్న ఉద్దేశంతో కొందరు రైతులు ఆరీ ఆరకుండా కట్టివేసి కుప్పలువేసేందు కు ఆదుర్దా పడడంతో కూలీరేట్లు మరింత భారం అవుతున్నాయి. కట్టి కుప్పవేసేందుకు ఎకరాకు నిన్నమొన్నటివరకు రూ.5 వేలుగా ఉన్న కూలీ ఆదివారం ఒక్కసారిగా రూ. 8వేలకు పైగా పెంచేశారు. దీంతో చేసేది లేక అడిగినంత ఇచ్చి రైతులు కుప్పలు వేయిస్తున్నారు.

తుపానుతో రైతుల్లో గుబులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్రవాయుగుండం తుఫానుగా మారి కోస్తా వైపు దూసుకు రావడంతో పాటు అది నెల్లూరు మచిలీపట్నం మధ్య తీరం దాటనున్నది అనే వార్త దివిసీమ ప్రాంత రైతుల గుండెల్లో గుబులు పుట్టించడంతోపాటు ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావం ఎంత భయంకరంగా ఉంటుందో దివిసీమ ప్రజలకు తెలుసు అయితే వర్ష బాగా పరిస్థితులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొని పంటలు పండించుకొని అవి నోటి కాడికి వచ్చే సమయానికి తుఫాను ముప్పు ముంచుకు రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాలలో పంట తయారై కోతలు కోసేందుకు సిద్ధంగా ఉండగా మరి కొన్నిచోట్ల కోతలు మొదలుపెట్టి పనులు చేలల్లో ఉన్నాయి. మరోవైపు యంత్రాల ద్వారా పంటలు పోయించిన రైతుల ధాన్యం రోడ్లపైన ఎండబెట్టి ఉంది. ఈ నేపథ్యంలో తుఫాను గాలివీచిన వర్షాలు పడ్డ ఆ పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. మరోవైపు ఉద్యానవన పంటలు అరటి చెరకు కాయగూరల తోటలు కూడా పూర్తిగా ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో తుఫాను అంటే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది అని ఆందోళన చెందుతున్నారు. తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఆదివారం అయినప్పటికీ రెవిన్యూ పంచాయతీరాజ్ అధికారులతో పాటు పోలీసులు కూడా ప్రజలను రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ అన్ని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు

ప్రశాంతంగా మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలు ప్రశాంతంగా పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెర సుల్తానా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉయ్యూరులోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ఫ్లోర ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, వి ఆర్ కె ఎం ఉన్నత పాఠశాలలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమీషనర్ యమ్.డేవిడ్ రాజు,5 కేంద్రాలను, అలాగే జిల్లాలోని 03 రెవిన్యూ డివిజన్ లలో 03 ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ లు పరీక్షా కేంద్రంలను సందర్శించారు. మొత్తం 4188విద్యార్థులకు గాను 3,929 హాజరయ్యారాన్నారు. 259 ,విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** కేంద్ర ప్రాయోజిత పథకం నేషనల్ మీన్స్కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉయ్యూరు డివిజన్లో ఆరు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరుగగా 1155 మంది విద్యార్థులకు గాను 1091 మంది పరీక్షకు హాజరయ్యారు. జిల్లా విద్యాశా ఖ అధికారి తాహెరా సుల్తానా, ఉప విద్యాశాఖాధికారి ఐ. పద్మారాణి పరీక్షా కేంద్రాల ను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభ కనపరచిన విద్యార్థులకు 8వ తరగతిలో అర్హత పరీక్ష ఉంటుందని, నెలకు వెయ్యి రూపాయల చొప్పున 9 నుండి 12వ తరగతి వరకు ఎంపికచేసిన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనంగా ప్రతి సంవత్సరం అంద జేస్తారని తెలిపారు.

ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మీచౌంగ్ తుఫాను వలన ధాన్యానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తక్షణమే లారీల్లో మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు.ఆదివారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పెద్దిరోజా జిల్లా అధికారులు క్షేత్రాధికారులతో నిర్వహించి మీచౌంగ్ తుఫాను నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీచౌంగ్ తుఫాను ప్రభావిత మండలా లైన నాగాయలంక, కత్తివెన్ను, కోడూరు, మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మోపిదేవి మండలాలపై ప్రత్యేక దష్టి సారించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు సత్వరమే పూర్తి చేయాలన్నారు. తుఫాన్ షెల్టర్లను, పునరావాస కేంద్రాలను తనిఖీ చేసి తక్షణమే కావాల్సిన వసతులు ఏర్పాట్లు చేయాలన్నారు. తుఫాన్ నేపథ్యంలో నాలుగు రోజులు వరి ధాన్యం కోతలు ఆపాలని చెప్పామన్నారు. మిల్లుల దగ్గరే ఎక్కువగా ధాన్యంతో లారీలు ఉంటున్నాయని తక్షణమే వాటిని ఖాళీ చేయించి రైతుల దగ్గరికి పంపించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గత మూడు రోజులుగా రోడ్లపైనే ధాన్యం ఎండుతున్నదని వెంటనే లారీలకు ఎక్కించి మిల్లులకు చేర్చాలని సూచించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం ఎంతోనో తెలుసు కాబట్టి ఆ మేరకు మిల్లుల దగ్గరికి ధాన్యంతో లారీలను పంపించాలన్నారు.వర్షాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం తడిసి దెబ్బతినరాదని, రైతులు నష్టపోరాదని స్పష్టం చేశారు.ప్రతి మండలంలో ఎన్ని లారీలు ఉన్నాయి ఏం జరుగుతుందో తెలుసుకోకపోతే ఎలా అని ప్రశ్నిస్తూ ఎవరైనా లారీలు సరఫరా చేసే యజమానులు గానీ, కాంట్రాక్టర్లు గానీ ముందు ఒప్పందం ప్రకారం సరఫరా చేయకపోతే వారిని బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం వారిపై క్రిమినల్ కేసులు బనాయించాలని హెచ్చరించారు. లారీల కాంట్రాక్టర్లు గానీ యజమానులు కానీ మిల్లర్లు గాని ఎవరైనా సరే ఎంతటి వారైనా సరే ఈ అత్యవసర పరిస్థితిలో ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ ఖచ్చితమైన విధానాన్ని అనుసరించాలని స్పష్టం చేశారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, దేవస్థాన కార్య నిర్వహణ అధి కారి కానూరి సురేష్ బాబు ఏర్పాటు పరిశీలించినట్లు తెలిపారు.

దిగుబడి ఫుల్...కొనుగోలు నిల్...

- మధ్యంతర ఉత్తర్వులతో రైతుల దిగాలు
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న మిల్లర్లు

ప్రజాశక్తి - గుడివాడ(నందివాడ)

నందివాడ మండలం జొన్నపాడు గ్రామంలో గత ఏడాది కంటే ఈ ఏడాది వరిసాగులో పంట దిగుబడి ఎక్కువ వచ్చింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం 27,28 తేమ శాతం ఉంటే కొనుగోలు చేస్తామని చెప్పడంతో హడావుడిగా రైతులు, కౌలు రైతులు కోత మిషన్ల సాయంతో వరిపంట కోతలు మొదలు పెట్టారు. ఇప్పటికే మండలంలో మొత్తం 4150 ఎకరాలు సార్వా పంటలు పండిస్తుండగా ప్రస్తుతం 934 ఎకరాలకు పైగా కోత కోసేశారు. కానీ ప్రభుత్వం 3 రోజుల్లోనే సీలింగ్ మార్చేసి 17 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వాతావరణం దృష్ట్యా ప్రభుత్వం తేమ శాతాన్ని రైతులకు అనుగుణంగా 28శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అలాగే ఎకరాకు 40 బస్తాలు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని మిగిలిన ధాన్యాన్ని మిల్లర్లకు అమ్మాలంటే చాలా తక్కువ ధరకు అమ్మాలని చెప్పడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని మిల్లర్లకు అమ్మడానికి వెళ్ళి క్యూలో ఉండటం ద్వారా బస్తాలలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలలోనే మొలకలు రావడం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. వైకాపా రైతుల ప్రభుత్వంగా చెప్తున్న నాయకులు రైతుల గోడును విని అర్థం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి

మిల్లర్స్ మోసం చేస్తున్నారు : కొండపల్లి రవికుమార్ రెడ్డి

2 లారీలు లోడ్ చేశాం. 27,28శాతం తేమ ఉందన్నారు. 3 రోజుల్లోనే ప్రభుత్వం నిబంధనలు మార్చే శారు. మిల్లర్స్ గత ఏడాది మోసం చేసి చాలా తక్కువ ధరకు కొన్నారు. కానీ ఈ ఏడాది తేడా జరగదని మిల్లర్స్ చెపుతున్నారు. ఆలోచనలో పడ్డాం.

మిగిలిన ధాన్యాన్ని ఏంచేయాలి? : కొల్లారెడ్డి వసంత లక్ష్మణరెడ్డి

20 ఎకరాలు సాగు చేస్తున్నాం..ప్రభుత్వం 40 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నామని చెప్తుం ది. మిగిలిన ధాన్యాన్ని ఏం చేయాలి? రైతు భరోసా బదులు బోనస్‌గా బస్తాకి కలిపితే కౌలుదారులు, రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

రైతులు ఇబ్బందులు పడుతున్నారు
ఎం ప్రభాకర రెడ్డి, మాజీ సర్పంచ్

ఈ ప్రభుత్వం రోజుకోరకంగా చెప్తుంది. సీలింగ్ ముందుగా చెప్పినట్లు కోత కోశాం. కానీ మళ్ళీ సీలింగ్ మార్చేసింది. ధాన్యాన్ని గుట్టలుగా పెట్టడం వల్ల గింజ ఆయ వస్తుంది. సీలింగ్ వల్ల రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాది డబ్బులు నేటికీ రైతుల జేబులోకి చేరలేదు.

రైతుల గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలి : నారపురెడ్డి మలిరెడ్డి

మార్జిన్‌లో తేడాలు ఉన్నాయి. ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వచ్చింది. కానీ ప్రభుత్వం 40 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తాం అంటున్నారు. మిగిలిన ధాన్యాన్ని ఏం చేయాలి? రైతుల గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలి.

గింజ మొలకలు వస్తున్నాయి : మలిరెడ్డి వీరాస్వామిరెడ్డి

10 ఎకరాలు సాగులో ఉంది. 20శాతం తేమ ఉంటే ఆరబెట్టుకు రమ్మన్నారు. మిల్లర్ల దగ్గర అన్‌లోడింగ్ కోసం లారీలు లోడ్‌తో క్యూలో ఉన్నాయి. లోడ్ దించడం ఆలస్యం అవడం వల్ల మొలకలు వచ్చా యి. ఏం చేయాలో అర్థం కావడంలేదు.

వాతావరణం దృష్ట్యా తేమశాతాన్ని 20గా చేశారు
మండల వ్యవసాయాధికారి ఎన్ భాను ప్రకాష్

వాతావరణం దృష్ట్యా ప్రభుత్వం తేమశాతాన్ని 20 చేశారు. రైతుల ధాన్యాన్ని డ్రయర్ ఉన్న మిల్లర్లకే పంపుతున్నాం. ఇప్పటి వరకు 931.88 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం.

ముంచుకొస్తున్న మిచౌంగ్

- అప్రమత్తమైన అధికారులు
- కంట్రోల్ రూమ్‌లు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ప్రత్యేక అధికారుల నియామకం
- ధాన్యం తరలించేందుకు రైతుల అవస్థలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

బంగాళాఖాతంలో బాపట్ల మచిలీపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 530 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన మిచౌంగ్ తుపాను మంగళవారం తీరం దాటుందని వాతావరణ శాఖ తెలిపింది. బాపట్ల-మచిలీపట్నం సమీపంలో తుపాను తీరం దాటుతుందని, దీని ప్రభావం కృష్ణాజిల్లాపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని తీరప్రాంత మండలాలు, ఆర్డీవో కార్యాలయం, కలెక్టరేట్‌లో ఇప్పటికే కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక అధికారులను ఆదివారం నియమించారు. తుపాను ప్రభావంతో ఆదివారం నాలుగు గంటల నుంచి ఈదురుగాలులు అధికమయ్యాయి. సోమ, మంగళవారాల్లో గాలులుతో పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. వాతావరణ పరిస్థితులు తీరప్రాంత ప్రజలను, రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పంటలను సంరక్షించుకునేందుకు రైతులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకుని తేమ శాతం పేరుతో రైతుల నుంచి తరుగు పేరుతో మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 17 శాతానికి మించి అదనంగా ఉన్న తేమకు ఒక్కో పాయింట్‌కు కిలో ధాన్యం అదనంగా తీసుకుంటున్నారు. 75 కిలోల బస్తాకు 8 కిలోల ధాన్యం తరుగు కింద అదనంగా రైతులు కోల్పోవాల్సి వస్తోంది. తుపాను నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లో ధాన్యం మిల్లులకు తరలించే అవకాశం అధికారులు కల్పించినా రవాణా వాహనాల కొరతతో ఆదివారం సాయంత్రానికి చాలా ప్రాంతాల్లో రోడ్లపైనే ధాన్యం ఉండిపోయింది.

కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన కౌలు రైతు లోయ శ్రీనివాసరావు ఆరు ఎకరాలు, కంకిపాడుకు చెందిన కౌలు రైతు మొవ్వ వీరబాబుకు చెందిన మూడు ఎకరాలు, కంకిపాడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన వి.జాన్‌మోజస్ నాలుగు ఎకరాల్లోని ధాన్యం రవాణా వాహనాలు అందుబాటులోకి రాక మిల్లులకు తరలించలేకపోయారు. ఎంఎన్‌కె రహదారి గుడ్లవల్లేరు-అంగలూరు మధ్య వేలాది బస్తాలు ధాన్యం రోడ్లపైనే ఉంది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 85 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్‌మిల్లులకు తరలించాల్సి ఉండగా ఆదివారం సాయంత్రానికి 55 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే రైస్ మిల్లులకు వెళ్లింది. 30 వేల టన్నులు ధాన్యం రోడ్డుమీద, కల్లాల్లో నిల్వ ఉంది. ధాన్యం సంరక్షణకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టార్పాలిన్లు అద్దెకు తీసుకు వచ్చి ధాన్యం సంచులు, రాసులపై కప్పారు. గాలులు తీవ్రత అధికంగా ఉంటే టార్పాలిన్‌లు ఎగిరిపోయి ధాన్యం తడుస్తుందని రైతులు చెబుతున్నారు. సాధారణ పద్ధతిలో కోతలు కోసి పనలపై ఉన్న 20,600 ఎకరాలకు సంబంధించి ఆదివారం ఐదు వేల ఎకరాల్లో కుప్పలు వేశారు. సాధారణంగా పనలు పోగేసి కుప్పలు వేయడానికి ఎకరానికి రూ.3,500 కాంట్రాక్టు పద్దతిలో చెల్లించాల్సి ఉండగా, కట్టేత డిమాండ్‌ను ఆసరా చేసుకుని ఉంగుటూరు మండలంలో రూ.5 వేల వరకు అదనంగా రైతులు చెల్లించాల్సి వచ్చింది. ఎండ లేకుండానే హడావుడిగా పనలు పోగేసి తేమ ఎక్కువ ఉన్న పనలు వేడి వచ్చి కుప్పల్లో ధాన్యం రంగుమారతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 3.74 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా ఇప్పటి వరకు 85 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట వివిధ దశల్లో ఉంది. అత్యధిక విస్తీర్ణంలో పంట కోతకు వచ్చింది. కోడూరు, నాగాయలంక, కృత్తివెన్న తదితర తీర ప్రాంత మండలాల్లో, ఆలస్యంగా వరి నాట్లు పడిన కాలువ శివారు భూముల్లో కొంత భాగం వరి పంట కంకి పాలు పోసుకునే దశలో ఉంది. తీవ్ర గాలులు వీస్తే వరి పంట నేలవాలి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం తరలించేందుకు అవస్థలు పడుతున్న రైతులు

పాలకాయతిప్ప వద్ద ఎగిసిపడుతున్న అలలు

ప్రజాశక్తి-కోడూరు: మిచౌంగు తుపాను కారణంగా కోడూరు మండల పరిధిలోని పాలకాయతిప్ప వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అలలు ఎగిసిపడుతున్నాయి. తుపాను కారణంగా ఆదివారం ఉదయం నుండి కోడూరు మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం గతం కంటే ముందుకు చొచ్చుకు వచ్చింది. దీంతో పర్యాటకులను సముద్రం వద్దకు రాకుండా స్థానిక ఫారెస్ట్, మెరైన్, సివిల్ పోలీసులు పెద్ద సంఖ్యలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తీరప్రాంత గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు మకాం వేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించడానికి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. హంసలదీవి, పాలకాయతిప్ప, బసవానిపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఎప్పటికప్పుడు అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తుపాను కారణంతో తొమ్మిది నుండి పది అడుగుల మేర సముద్ర అలలు పైకి ఎగిసిపడుతున్నాయని స్థానిక మత్స్యకారులు తెలుపుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాలకాయతిప్ప కరకట్ట చెక్‌పోస్టు వద్ద ఉన్న గేట్లను ఈ నెల ఏడో తేదీ మూసివేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు కోరారు. కోడూరు మండలంలో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎస్‌కె లతీఫ్ పాషా తెలిపారు. లోతట్టు గ్రామ ప్రజలందరినీ ఆ కేంద్రాలకు తరలిస్తామన్నారు. మండల పరిధిలోని ఊటగుండం, బసవానిపాలెం, పాలకాయతిప్ప, జార్జి పేట, చింతకోళ్ల గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

వికలాంగుల సాధికారతకు కృషి

పెన్షన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. వేడుకల్లో భాగంగా సాయిప్రేమ్, చేయూత, శిరీష రిహాబిలిటేషన్ సెంటర్, విజయమేరీ తదితర సంస్థల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకలను పురస్కరించుకొని వినికిడి పరికరాలు, ట్రై సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల, వయో వృద్ధుల సహకార కార్పొరేషన్ ఎండి ఎంకే కుమార రాజా, జిల్లా వికలాంగులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, సంక్షేమ సంఘం ప్రతినిధి బి.కిరణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి

ప్రారంభం కాలేదు. 33,228 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో జరుగుతున్నాయి.

ప్రశ్న: బిల్లుల మంజూరు ఎలా జరుగుతుంది?

నిర్మాణ పనుల పురోగతిని ఆధారం చేసుకొని వివిధ దశల ప్రకారం బిల్లులు మంజూరు చేయడం జరుగుతుంది. ఎక్కడా ఎటువంటి లోపాలు జరగకుండా చూస్తున్నాం.

ప్రమాదకరంగా శబ్ధ కాలుష్యం

- నిర్ణీత స్థాయిల కంటే ఎక్కువ నమోదు
- ఇండస్ట్రియల్, కమర్షియల్‌తో పాటు నివాసిత ప్రాంతాల్లోనూ మోత
- రాజధాని ప్రాంతంగా మారిన తర్వాత పెరిగిన కాలుష్యం
- విజయవాడలో 20 శాతం పెరిగిన వాహనాలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడలో శబ్ధ కాలుష్యం ప్రమాదకరంగా మారింది. నిర్ణీత స్థాయిల కంటే అధికంగా నమోదవుతుండటంతో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వాణిజ్య, ఇండస్ట్రీయ్ ఏరియాలతో పాటు నివాస ప్రాంతాలలో కూడా ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్ర రాజధాని అమరావతిలో భాగమైన తర్వాత విజయవాడలో శబ్ద కాలుష్యం స్థాయిలు వేగంగా పెరుగుతున్నాయి. పీక్ అవర్స్‌లో అయితే తీవ్రంగా ఉంటున్నాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు స్టాండర్డ్స్ మేరకు రెసిడెన్షియల్ ఏరియాల్లో పగటి పూట 55 డెసిబుల్స్, రాత్రి సమయాల్లో 45డెసిబుల్స్ ఉండాలి. కానీ అంతకు మించి నమోదవుతున్నాయి. డేటైమ్ 55.4, రాత్రి పూట 60.9డెసిబుల్స్ వరకు ఉంటున్నాయి. వాణిజ్య ప్రాంతాల్లో పగలు 65డిబి, రాత్రి 55డిబి ఉండాలి. కానీ పగలు 75.4డిబి, రాత్రులు 77.6 వరకు ఉంటున్నాయి. బెంజిసర్కిల్, ఆటోనగర్, పోలీస్ కంట్రోల్ రూమ్ వంటి పలు ప్రాంతాల్లో అయితే రాత్రి వేళల్లో 80.4డిబిల వరకు నమోదవుతున్నాయి. ఇక ఇండస్ట్రీయల్ ఏరియాల్లో పగలు 75డిబి, రాత్రులు 70డిబి ఉండాలి. కానీ ఆటోనగర్ వంటి ప్రాంతాల్లో పగలు 76.8డిబి, రాత్రులు 72.4డిబి వరకు ఉంటున్నాయి. నగరంలోని గురునానక్ కాలనీ, వెటర్నరీ కాలనీ, అజిత్ సింగ్ నగర్, యనమలకుదురు వంటి నివాస ప్రాంతాలు బెంజిసర్కిల్, బీసెంట్ రోడ్, విజయ టాకీస్, పోలీస్ కంట్రోల్ రూమ్, కాళేశ్వరరావు మార్కెట్, రామవరప్పాడు వంటి వాణిజ్య ప్రాంతాలు, రైల్వే స్టేషన్ సమీపంలో శబ్ద కాలుష్యం స్థాయిలు 15 నుండి 30 డిబిల వరకు ఉంటున్నాయి. బెంజ్ సర్కిల్‌లో పగటి పూట పీక్ అవర్స్‌లో 110 డెసిబుల్స్ వరకు ఉంటోంది. మరో వైపు శబ్ద కాలుష్యానికి వాహనాలు ప్రధాన కారణం. గతంతో పోల్చితే నగరంలో వాహనాల సంఖ్య 20 శాతం వరకు పెరిగినట్లు సమాచారం. దీంతో పాటు ప్రతి ఏటా 5 వరకు జనాభా పెరుగుతుండటం కారణంగా అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా నగరంలో శబ్ద కాలుష్యం స్థాయిలు పెరగడానికి సౌండ్ హారన్‌లు ఒకటని, పర్యావరణానికి దోహదపడేందుకు ప్రజలు స్వచ్ఛందంగా నో సౌండ్ రూల్ పాటిస్తే చాలా వరకు కంట్రోల్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు వాహనాల నుంచి వెలువడే బీకరమైన శబ్దాలను అరికట్టడంపై ఆర్‌టిఏ అధికారులు దృష్టి సారించాల్సి ఉన్నా ఆ విధమైన చర్యలు చేపట్టడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో పాటుగా నగరంలో పచ్చదనం పెంపొందిస్తే శబ్ద కాలుష్యం కొంత మేరకు తగ్గే అవకాశం ఉంది. కానీ విఎంసి దీనిపైన దృష్టి సారించడంలో వైఫల్యం చెందిందని పులువురు ఆక్షేపిస్తున్నారు. శబ్ధ కాలుష్యానికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలలో అధిక రక్తపోటు, వినికిడి లోపం, గుండె, నరాల సంబంధిత సమస్యలపైన, ప్రత్యేకించి మహిళలు హార్మోన్లు, రుతుక్రమం సమస్యలపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- బొండాడ ఇంజనీరింగ్ కంపెనీస్ సిఎండి బొండాడ రాఘవేంద్రరావు

మాట్లాడుతున్న బొండాడ రాఘవేంద్రరావు

విద్యార్థులకు నగదు చెక్కులను అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జీవితంలో ఆయా రంగాలలో స్వశక్తితో విజయం సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఎదగాలని హైదరాబాదుకు చెందిన బొండాడ ఇంజనీరింగ్ కంపెనీస్ సిఎండి బొండాడ రాఘవేంద్ర రావు సూచించారు. ఆదివారం అవనిగడ్డలోని ఏ 1 సమావేశ మందిరంలో రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 57 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ 3.59 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి అభివృద్ధికి చదువు మూల మన్నారు. చదువు ద్వారానే అభివృద్ధి సాధించగలు గుతామని ప్రతిభావం తులు కాగలుగు తామన్నారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగాలని సహాయ సహకారాలు అందిపుచ్చుకొని మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్ర మంలో పాల్గొన్న డి.ఎస్.పి పి మురళీధర్ మాట్లాడుతూ మంచి ఆలోచనతో రాయల్ సొసైటీ వారు అందజేస్తున్న ఈ సహాయం అని స్వయంకృషితో ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా బొండాడ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో అందజేసిన ఆర్థిక సహాయాన్ని విద్యార్థులకు చెక్కుల రూపంలో స్వయంగా అందజేశారు. అనంతరం రాఘవేంద్రరావు, డిఎస్పి మురళీధర్ తాసిల్దార్ ఎల్ వి ఎస్ రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ పెట్లేటి పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుండాపు చంద్రశేఖర్, కోశాధికారి గాజుల రామారావు, తదితరులు పాల్గొన్నారు

చల్లపల్లిలో మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణను పదేళ్లపాటు దోచుకున్న కేసీఆర్ కుటుంబ అవినీతి పరిపాలనకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మీర్ రిజ్వాన్ అన్నారు. ఆదివారం సాయంత్రం చల్లపల్లిలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు పేల్చి, రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాబురావు, నాయకులు కొండేటి భాస్కరరావు, రాజు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-అవనిగడ్డ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయ సాధించడంతో అవనిగడ్డలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం ప్రకటించిన తెలంగాణ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ కి పూర్తి మెజార్టీ రావడంతో ఆ పార్టీకి చెందిన మండల పార్టీ అధ్యక్షులు డ్ల వీర రాఘవులు ఆధ్వర్యంలో రాజీవ్ సెంటర్లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. పార్టీ నాయకులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ, ఆది రామ్మోహన్రావు, మైనార్టీ శాల అధ్యక్షులు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-పెదపారుపూడి : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ విజయదుంది మోగించడంతో పెదపారుపూడి మండలం లో టిడిపి పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవాలను నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో టిడిపి శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కూచిపూడి సుబ్బయ్య ,గొరిపర్తి రవికుమార్, బంగారు బాబు ,పొనుగుమాటి సత్యనారాయణ పాల్గొన్నారు .

పెదపారుపూడిలో...

యోగా సాధన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట యోగ సాధకుల సంఘం, పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో యోగా చేయండి ఆరోగ్యంగా జీవించండి అనే నినాదంతో ఆదివారం పాలేటి ఒడ్డున మఠం శివాలయంలో యోగ సాధన చేశారు. ఈ యోగ సాధనలో గురూజీ విడివి. సాయి కుమార్ పర్యవేక్షణలో రాధాకృష్ణ, పూర్ణయ్య, చిత్రాల వెంకటేశ్వరరావు, తాజ్ మాస్టర్, గంగాధర్, ఆర్మీ రిటైర్డ్ జవాన్ శ్రీను కరుణాకర్ రెడ్డి, శివ, నర్సిరెడ్డి, బోనేపల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 00 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 9.30 గంటలకు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.డివిజన్, మండల, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను గ్రామ,వార్డు సచివాలయం, మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ ఢిల్లీ రావు ఆ ప్రకటనలో తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్‌సిపి రెడ్డి

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుడివాడ : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగులను పట్టించుకోవడంలేదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అన్నారు. గుడివాడ సుందరయ్య భవనంలో ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్సి పి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాళ్లకి పరికరాలు బ్యాటరీ బండ్లు, స్టిక్స్, వీల్ చైర్స్, చెవుడు మిషన్లు, వివిధ రకాల బూట్లు గడిచిన నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం అందించడం లేదన్నారు. వికలాంగులకు అనేక సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం పట్టించుకోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి రజిని, సయ్యద్ హుస్సేన్, గుడివాడ రాజేష్, అహ్మద్ విస్సంశెట్టి వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, వెంకటరమణ, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : ఓటర్ల జాబితా సవరణల్లో తెలుగు యువత నాయకులు కీలకపాత్ర పోషిస్తూ చేర్పులు, మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల తెలుగు యువత అధ్యక్షులు కలపాల సూర్యనారాయణ పిలుపునిచ్చారు. రేమల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన ఓటర్ నమోదు,ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ పరిశీలించారు. రేమల్లె గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు యనమదల శ్రీనివాసరావు గుడివాడ విజయానంద్ క్లస్టర్ ఇంచార్జ్ కలపాల కుమార్ పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వనసమారాధనలు

గుడివాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

హనుమాన్‌జంక్షన్‌లో...

ప్రజాశక్తి-గుడివాడ : కార్తీక సమారాధనలు ఐకమత్యానికి వేదికలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక విశాఆర్, వివిఎస్‌బి ఇంజనీరింగ్ కళాశాలలో గుడివాడ నియోజక వర్గం యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ వల్లా వినోద్ కుమార్, వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జెడ్‌పిటిసి గోళ్ళ రామకృష్ణ పాల్గొన్నారు. ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో ఘనంగా సత్యదేవ గౌడ సంఘం వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఈడుపుగల్లు గౌడ మహిళా నాయకురాలు మధు శ్రీహరి రాణి గౌడ సంఘం అధ్యక్షులు మోర్ల కనకరావు, కార్యదర్శి మార్ల ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే బొమ్ములూరు కండ్రిక గ్రామంలో గల వైటి కే.ప్రసాద్ పామాయిల్ తోటలో అక్కినేని, అక్కిన వారి 8వ కార్తిక వన సమారాధన ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. అక్కినేని రామచంద్రరావు అక్కినేని శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో మహిళలు పిల్లలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అక్కినేని సురేంద్ర చౌదరి, అక్కినేని లక్ష్మీనారాయణ, అక్కినేని చంద్, అక్కినేని నారాయణరావు పాల్గొన్నారు.ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పులిగడ్డ ఇరిగేషన్ గెస్ట్ హౌస్ వద్ద న్యాయవాదుల వన సమారాధన కార్యక్రమం ఉత్సా హభరితంగా నిర్వహించారు. సబ్ కోర్ట్ న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి విజయ కళ్యాణి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపీనాథ్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా న్యాయవాదులతో కలిసి వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనక రఘురాం, ప్రసాద్ సీనియర్ న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆటపాటలతో సంతోషంగా గడిపారు.ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆదివారం జరిగిన జిల్లా పద్మశాలీ సంఘ కార్తీక వనసమారాధన సమా వేశంలో పద్మశాలి సంఘం కృష్ణాజిల్లా నాయకుడు ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా గతసంవత్సరం పదవతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఉయ్యూరు, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల్లో ప్రథమస్థానంలో నిలిచిన తుమ్మలచర్ల హారికకు ప్రోత్సాహ క బహుమతిగా రూ. 5వేల నగదు అందజేశారు. ఎంవిఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ప్రముఖ రచయిత బండారు రాధాకృష్ణ , సంఘ నాయకులు సంగెపు రంగారావు, అంది జగదీష్ పాల్గొన్నారు. ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం వెంకటనరసింహపురం కాలనీలో కోటి రూపాయల వ్యయంతో శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామి ఆలయం కళ్యాణ మండపం నిర్మిస్తున్నట్లు గన్నవరం పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దామెర్ల నారద ముని తెలిపారు. ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిం చారు. సభలో పద్మశాలియ సంఘం జిల్లా అధ్యక్షులు మత్తే రామచంద్రరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యాలయం ప్రారంభం

మాట్లాడుతున్న ఎన్.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: బాధల్లో ఉన్న తోటి మానవులను ఆదుకోవడంలో ఎంతో ఆనందం ఉందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని స్థలదాత జన్యావుల సీతారామయ్య, రంగమ్మ దంప తులు కుమారుడు వెంకయ్య ప్రారంభించారు. అలాగే భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయలు అందించిన నెరుసు వెంకటేశ్వరరావు,బేబీ శకుంతల కుమారుడు రాజు మొదటి అంతస్తును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్ర ప్రదేశ్ లో 113 శాఖల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థల్లో సభ్యులు విద్యా, వైద్యం ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కష్టా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మానవతా వాదులందరు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పన కనక దుర్గా ప్రసాద్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర చైర్మెన్, మారుబోయిన కోటేశ్వరరావు, గోదావరి జిల్లాల సెంట్రల్ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, కష్టా జిల్లా అధ్యక్షులు పొట్లూరి వీర శేషగిరిరావు పాల్గొన్నారు.

జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జూనియర్స్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ శనివారం విజయవాడలోని స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి అక్బర్ పాషా, మందుల రాజీవ్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చు, ఈ పోటీల్లో విజేతలకు అండర్ 07, 09, 11, 13 ఏజ్ గ్రూప్ విభాగాల్లో గెలుపొందిన క్రీడా కారులకు రూ.15 వేలు నగదు ప్రోత్సాహకం పాటు సర్టిఫికెట్స్ ఇస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, క్రీడా కారులు తమ పేర్లను 7వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లను ఎపిసిహెచ్ఇఎస్ఎస్.ఒఆర్‌జి మరిన్ని వివరాలకు 9030308811 నెంబర్లలో సంప్రదిం చాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో టాటా సాల్ట్ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ అధ్యక్షులు బి.దీపిక తెలిపారు. నగరంలోని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్ కార్యాలయంలో టాటా సాల్ట్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరి గృహాల్లో విశ్వాసం, స్వచ్ఛతకు చిహ్నంగా టాటా సాల్ట్ ఉందని తెలిపారు. టాటా సాల్ట్ ప్రతి ఒక్కరి శ్రేయస్సు కోసం అధిక నాణ్యత, అయోడైజ్డ్ ఉప్పును అందించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ఏవి ధంగా తాము ప్రాధాన్యత ఇస్తున్నామనో నగరంతో పాటు వివిధ ప్రాంతాలలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

9న జెఎల్ఆర్ మోటార్స్ వాహనాల సర్వీసు క్యాంపు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జెఎల్ఆర్ మోటార్ కంపెనీ వార్షిక హాలిడే సర్వీస్ క్యాంపును ఈనెల 9వ తేదీ నుండి నిర్వహిస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రాజన్ తెలిపారు. నగరంలోని జెఎల్ఆర్ మొటార్ సంస్థలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. నగరంతో పాటు అన్ని అధీకృత డీలర్ల వద్ద సర్వీస్ క్యాంపు నిర్వహించబడుతుందని తెలిపారు. ఇందులో వాహన తనిఖీ, బ్రాండెడ్ వస్తువులు, ఉపకరణాలు, వంటి సేవలను పొందవచ్చని తెలిపారు. పాయింట్ ఎలక్ట్రానిక్ వెహికల్ హెల్త్ చెకప్, బ్రేక్ , వైపర్ చెక్, టైర్, ఫ్లూయిడ్ లెవెల్ చెక్, సమగ్ర బ్యాటరీ ఆరోగ్య తనిఖీని అందించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆరోగ్యానికి స్విమ్మింగ్, నడక, సైక్లింగ్ ఎంతో ఉపయోగపడతాయని ఎసిపి లక్ష్మీపతి అన్నారు. ప్రతి రోజు నడకకు, సైక్లింగ్‌కు కొంత సమయం కేటాయిస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిందని తెలిపారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిల్వర్ జూబిలీ రైడ్‌ను నగరంలో నిర్వహించారు. అమరావతి రన్నర్స్ సారధ్యంలో నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీని ఏసీపీ లక్ష్మీపతి ఇందిరా గాంధీ మునిసి పల్ స్టేడియం వద్ద జెండా ఊపి ప్రారంభిం చారు. మునిసి పల్ స్టేడియం నుంచి,

సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

డివి మ్యానర్ హోటల్ మీదుగా, ఏలూరు రోడ్, పోలీస్ కంట్రోల్ రూమ్, ప్రకాశం బ్యారేజ్, ఆక్వడెవిల్స్ వరకు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి లక్ష్మీపతి మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ఆక్వాడెవిల్స్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కరోనా, వరదల సమయంలో ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ కష్ణానది తీరాన 20 ఏళ్ళ క్రితం ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభించినట్లు, సుమారు 2 వేల మంది సభ్యులతో ఎంతో బాగా నిర్వహిస్తున్నారని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. 9, 10 తేదీల్లో జరగబోయే సిల్వర్ జూబ్లీ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు.

జాతీయ టిటి ర్యాంకింగ్ టోర్నీ

అండర్ -17 సింగిల్స్ విజేత ప్రియానుజ్, సిండ్రెల్లా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జాతీయస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ అండర్ -17 బాలురు విభాగంలో ప్రియానుజ్ భట్టాచార్య, బాలికల విభాగంలో సిండ్రెల్లా దాస్ టైటిల్‌ను కైవశం చేసుకున్నారు. నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం అండర్ -17 సింగిల్స్ ఫైనల్స్ పోటీలు జరిగాయి. ఇందులో బాలికల విభాగంలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన సిండ్రెల్లా దాస్ ప్రథమ స్థానం, మాజి సయానిక ద్వితీ స్థానం, సాధించారు. అలాగే మూడవ స్థానం వెస్ట్ బెంగాల్‌కు చెందిన రాయ్ శాన్వి, సాహ నందినిలు ఇద్దరు మూడవ స్థాణం సాధించారు. బాలుర విభాగగంలో ప్రియానుజ్ భట్టాచార్య ప్రథమ స్థానం, పునీర్ బిస్వాస్ ద్వితీయ స్థానం, మైని సుదాన్సు తృతీయ స్థానం సాధించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఒంగోలు ఉపాసనా హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పి.ప్రియా బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, కోచ్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయం సాధించిన క్రీడాకారులు

కృష్ణా తరంగ్-2023లో నలంద ప్రతిభ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన కృష్ణా తరంగ్ - 2023 సాంస్కృతిక ఉత్సవాల్లో నగరంలోని నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరిచి మూడోస్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలన తెలియచేశారు. నవంబరు 30 నుండి డిసెంబరు 2 వరకు జరిగిన కృష్ణా తరంగ్ పోటీలు వర్శిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించారన్నారు. ఇందులో పాల్గొన్న తమ కలాశాల విద్యార్థులు 13 అంశాలలో బహుమతులు సాధించినట్లు తెలిపారు. వెస్ట్రన్ గ్రూప్ సింగింగ్, డిబేట్, మైమ్, వన్ యాక్ట్ ప్లే, స్కిట్, స్పాట్ ఫోటోగ్రఫీ,లో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంటల్, ఫోక్ యాక్ట్ ప్లే, స్కిట్, స్పాట్ ఫోటోగ్రఫీలో రెండవ స్థానం తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ఆర్కెస్ట్రా, గ్రూప్ ఇండియన్ సింగింగ్, వెస్ట్రన్ సోలో సింగింగ్‌లో మూడవ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులన నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విరబూసిన బ్రహ్మకమలం

పెనుగంచిప్రోలు : స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి నివాసంలో శనివారం రాత్రి బ్రహ్మకమలం మొక్క తెల్లని పుష్పంతో విరబూసింది. ఈ మొక్క నాటిన 12 సంవత్సరాల తర్వాత పూస్తుంది. ఆ తర్వాత ప్రతి సంవత్సరం పువ్వుపూస్తుందని సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి తెలిపారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో షబాజ్ ప్రతిభ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామకు చెందిన మహమ్మద్ నూరుద్దీన్ కుమారుడు మొహమ్మద్ సఫాన్ షబాజ్ జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపాడు. నంది గామ పల్లగిరి శ్రీవిద్య విశ్వవిద్యాలయం తరుపు నుండి జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ ఎగ్జిబి షన్‌లో విజయ వాడ నలంద సీబీఎస్సీలో జరిగిన ఎగ్జిబిషన్ కాంపిటీషన్లో కేటగిరి వన్‌లో మొదటి స్థానంలో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సౌర శక్తిని ఉపయోగించి విద్యుత్‌ను ఆదా చేసే విధానం, ఈ విధానం గవర్నమెంట్‌కు, డొమెస్టిక్‌కు, వ్యవసాయానికి ఉపయోగపడేలా ఉండాలనే ప్రాజెక్టులో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

వెనిగళ్ల పార్థసారధికి ఘన నివాళి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ విద్యా సంస్థ గోసలైట్స్ మెడికల్ అకాడమి చైర్మన్ నరేంద్రబాబు తండ్రి వెనిగళ్ల పార్థసారధి సంస్మరణ సభ ఆదివారం మంగళగిరి సికె కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు, శ్రీ గోసలైట్స్ సిబ్బంది వెనిగళ్ల పార్థసారధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. 1937లో జన్మించిన వెనిగళ్ల పార్థసారధి బాల్యం నుండే విద్యలో రాణించారని, రాజమండ్రి నగరంలో లెక్చరర్‌గనా 1963లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఎంతో మందిని ఉన్నత వంతులగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేసిన వ్యక్తి వెనిగళ్ల పార్థసారధి అని పలువురు పేర్కొన్నారు.

పార్థసారధి సంస్మరణ సభలో పలువురు వక్తలు

వినికిడి లోపానికి ప్రత్యేక సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డిజిటల్ చెల్లింపుల రంగంలో అగ్రగామిగా ఉన్న అమెజాన్ పే, వినికిడి లోపం, మాట లోపం ఉన్న వినియోగదారుల కోసం ప్రత్యేకంగా సంకేత భాష కెవైసి సేవలను ప్రారంభించినట్లు అమెజాన్ సంస్థ ప్రతినిధి ఎం.ఈశ్వర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సైన్ లాంగ్వేజిల ద్వారా కమ్యూనికేషన్ ఉంటుందని, అమెజాన్ పే ఉద్యోగులు, వినియోగదారుల మధ్య సంకేత భాషలో టూ వే వీడియో కమ్యూనికేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సంకేత భాషపై ఆధారపడే వారి కోసం కేవైసీ ప్రక్రియను సునా యా సంగా చేయడం, డిజిటల్ చెల్లింపులను మరింత సులువుగా చేసే లక్ష్యంతో దీనిని రూపొందించినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని డిజిటల్ సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

తలనొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు...!

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : తలనొప్పి నేడు దాదాపు అందరూ ఎదుర్కొనే ఆరోగ్య సమస్య. గణాంకాల ప్రకారం ఏటా ప్రతి నలుగురిలో ఒద్దరి నుండి ముగ్గురు తలనొప్పితో ఇబ్బంది పడుతున్నారు. తలనొప్పి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటి గురించి నగరంలోని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ అనిల్ న్యూరో అండ్ ట్రామా సెంటర్ వైద్యులు అనిల్ కుమార్ దేవనబోయిన ప్రజాశక్తికి తెలియచేశారు.

రెండు రకాలుగా : తలనొప్పి ముఖ్యంగా రెండు రకాలుగా చెప్పవచ్చును ఒకటి ప్రైమరీ తలనొప్పి, రెండోది సెకండరీ తలనొప్పి, ప్రైమరీ తలనొప్పిలో నొప్పి రావడమే ప్రధాన మసస్య అన్నారు. ఒత్తిడి వల్ల 70 శాతం తలనొప్పి రాగా మైగ్రేన్ తలనొప్పి 16 శాతంగా ఉంటుందన్నారు. ఈరెండు రకాలను ప్రైమరీ తలనొప్పిగా భావిస్తారని తెలిపారు.

లక్షణాలు ఇలా ఉంటాయి : మైగ్రేన్ ఉన్న వారిలో తలలో ఒకవైపు నొప్పి చాలా తీవ్రంగా ఉంటుందని, మైగ్రేడ్ మొదలయ్యే ముందు అసాదారణమైన వాసనలు, కళ్లల్లో ఏవో కాంతులు కనిపించడం, వాంతులు, వికారం, శబ్దాలు వినలేకపోవడం, వెలుతురును చూడలేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఉదయం నిద్రలేచిన కాసేపటికి మొదలై కొన్ని గంటల వ్యవధిలో ఇది తీవ్ర నొప్పిగా మారుతుందన్నారు. ఒత్తిడి కారణ:గా వచ్చే తలనొప్పి సాయంత్రం వేళల్లో ఎక్కువగా ఉంటుందన్నారు. సైనస్ వల్ల కలిగే తలనొప్పి ఉదయం లేవగానే తీవ్రంగా ఉంటుందని తలను ముందుకు వంచి ఉంచినపుడు నొప్పి ఎక్కువ అవుతుందన్నారు. సైనల్ వల్ల తలనొప్పి వచ్చినపుడు జలుబు, వంటి ఇతర లక్షణాలు కూడా ఉంటాయన్నారు.

ప్రమాద ఘంటికలు : తలనొప్పిలో ఈక్రింది లక్షణాలు కనిపిస్తే వైద్యులను తప్పకుండా సంప్రదించాలన్నారు.
-అర్ధరాత్రి నిద్రలో అకస్మాత్తుగా తీవ్రంగా తలనొప్పి వచ్చినపుడు.- ఉదయం లేవగానే తలనొప్పి తీవ్రంగా ఉంటే - రోజు రోజుకూ తలనొప్పి పెరుగుతూ ఉంటే.- తలకదలించినా , దగ్గినపుడు, తుమ్మినపుడు, ముందుకు వంగితే నొప్పి ఎక్కువ అవుతుంటే.- వాంతులు లేదా మూర్చ కలిగించే తలనొప్పి - స్పృహ కోల్పోవడం, అధికంగా నీరసం, నడక తడబడటం వంటి లక్షణాలు ఉన్నపుడు. - తలకు దెబ్బ తగిలిన అయిదు రోజులలో కలిగే తలనొప్పి - చూపు మందగించం, రెండుగా కనిపించడం, మెల్లకన్ను రావం వంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

వైద్య పరీక్షలు : ముందుగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు చూపు పరీక్ష, సైనస్ కోసం ఎక్స్‌రే వంటి పరీక్షలను చేస్తారన్నారను. ఇన్‌ఫెక్షన్ వల్ల వచ్చే తలనొప్పికి రక్త పరీక్షలు, అవసరమైతే వెన్ను పూస నుండి నీరు తీసి దానిని పరీక్షిస్తారన్నారు.

చికిత్స : తలనొప్పికి కారణాన్ని బట్టి దాని రకాన్ని బట్టి చికిత్స చేయాల్సి ఉంటుందని, ఒత్తిడి వల్ల వచ్చే తలనొప్పికి, మైగ్రేన్ నొప్పికి వేరువేరు చికిత్సలు ఉంటాయని అన్నారు. తరచుగా మైగ్రేన్ నొప్పి వస్తుంటే అంటే నెలకు నాలుగు సార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు మైగ్రేన్ నొప్పి వస్తుంటే వారు మూడు వారాల పాటు మాత్రలు వేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్థంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.